

కాళ్ళూరు వెంకటరామారావు గారు

అరణ్యం అంతటా గాఢనిశ్శబ్దం అలుముకుంది. ఝామురాత్రికి పైగా అయివుంటుంది. ప్రశాంతమైన చంద్రకాంతిలో వృక్షాగ్రాలు తళతళ మెరుస్తున్నాయి. నేలమీద అక్కడక్కడ చంద్రకాంతి తెల్లని మరక మరకలుగా చెట్లసందుల్లో నించి పడుతూంది. అప్పుడే వర్షం కురిసి వెలిసినందువల్ల చెట్లనుండి నీటిబిందువులు రాలుతున్నాయి. నేలరాలిన ఆకులు తడిసిమెత్తబడి శబ్దంచెయ్యడం లేదు.

ఇంతలో దూరాన్ని నిబిడంగా అల్లుకున్న పొద లూ తీగలూ హఠాత్తుగా కదలడం ప్రారంభించినవి. తుప్పలలోనించి దారిచేసుకుంటూ ఒక భయంకర ఖడ్గ మృగం నడుస్తూంది. దారిలోవున్న తీగెలు దాని వురవడి కాగలేక పటపటా తెగిపోతున్నాయి మదోద్రేకంచేత శరీరం కానకుండా నడుస్తూంది ఆజంతువు.

తోవలో కనబడ్డ పెద్దపెద్ద వృక్షాలకు ఆనుకొని ఒంటికసి తీరేటట్లుగా రాసుకుంటూంది. చిన్న చెట్లను ముట్టెతో ఒక్కొక్క దెబ్బకొట్టి పెళ్లుమనిపడదోస్తూంది. నడిచేటప్పుడు దానినీడవల్ల వెన్నెలమరకలు పోయి గాఢమైన చీకట్లు బయలుదేరుతున్నాయి. అల్పజంతువులు గుండెలు కొట్టుకుంటూ నలుదిక్కులా చెల్లాచెదరై పోతున్నాయి. కాని అది వాటిలో ఒక్కదానిజోలికైనా పోలేదు.

మాటిమాటికి నేలమీదముట్టె నానించిపసిపడుతూంది. ఒకొక్కచోట నిలబడి చంద్రుడివంక చూస్తూ మూలుగుతూంది. మరొకప్పుడు నేలమీద పరుండి ఒక్కసారిగా కుప్పించి దుముకుతూంది. భూమిమీద పడి దొర్లుతూంది. కామపరవశుడైన క్రూరరాక్షసుడి లాగ కనబడుతూంది ఆభయంకరమృగం.

ఇంతలో దానికి రెండు వందలగజాల దూరంలో ఏదోసడి వినబడ్డది. చప్పున ఆగి చెవులురిక్కించుకొని ఆశబ్దాన్ని శ్రద్ధతోవింది. ముట్టెతో నేలమీద పసిపట్టింది. తక్షణం క్రోధమూర్తియై నాలుగుకాళ్లతోనూ నేలను తవ్వడం ప్రారంభించింది. దానివైఖరి చూస్తే ఏదో మహాయుద్ధానికి కాలుతవ్వుతున్న యోధుడిలా గుంది.

క్రమక్రమంగా దూరంగా వినబడిన సడి సమీపిస్తూంది. వేరొక బ్రహ్మాండమైన ఖడ్గమృగం మందగమనంతో వస్తూంది. అది మెల్లిగా మొదటి దానిని సమీపించి టక్కున ఆగిపోయి దానివంక రెప్పవాల్చకుండా చూసింది.

తక్షణం దాని శాంతస్వరూపం అంతా నిముషంలో భయంకరాకారంగా మారిపోయింది. కళ్లు యెర్రగా చింతనిప్పుల్లాగు మెరిశాయి. పౌరుషోద్రేకంచేత శరీరం రెట్టింపుగా పొంగి పోయింది. అదికూడా కాళ్ళతో నేల గువ్వడం ప్రారంభించింది.

రెండు జంతువులూ ఒకదానివంక ఒకటి తీక్ష్ణంగా చూసుకున్నాయి. తోకలు "రైంయి" మని తిప్పుతున్నాయి. ఒకదానికొకటి వెనకతియ్యకుండా రణసన్నాహంలో వున్నాయి. నాలుగుకాళ్లూ వంచి భూమిమీద

కుప్పిగంతుకి సిద్ధంగా మోకరించుకుని కూచున్నాయి. కాని యేదిగాని ముందుగా యుద్ధంలోకి దిగలేదు.

ఇల్లా వుండగా సమీపంలోనే ఒక ఆడజంతువు ప్రవేశించి వీటిని చూసింది. ఒక్కనిముషం ఆగి మెల్లగా దగ్గిరకి చేరింది. ఈ రెండు కూడా దాన్ని చూశాయి. చూడ్డంతోటే రెండింటికీ పౌరుషం మరింత పెరిగి పోయింది. ఒక్కొక్కటి స్త్రీజంతువువేపు చూసి మళ్లా ద్విగుణీకృతక్రోధంతో తోక తిప్పుకుంటూ యెదుటనున్న శత్రువువంక చూసేది.

ఉండి వుండి స్త్రీమృగం భయంకరగర్జన చేసింది. ఆ అరుపు వినీ వినడంలో రెండు పురుషమృగములూ చప్పున ఒక దానిమీదికి వేరొకటి దుమికాయి. ఆ ఆడు జంతువు అరపు వాటికొక రణభేరీమోతలాగు వినబడ్డది. ఆ అరపు వాటిశరీరాలను పులకాంచితములుగా చేసింది. అది విన్నందువల్ల వాటిపరాక్రమము ఉప్పొంగిపోయింది. తక్షణం అవి కలియబడి పోరాట ప్రారంభించాయి.

ఆజంతువుల భయంకరగర్జనల వల్ల వననీము లన్నీ మారు మ్రోగుతున్నాయి. పదఘట్టనలచేత చుట్టుప్రక్కల భూభాగమంతా గోతులు పడిపోయినది. దెబ్బలవల్ల ఫెళ్లుమనే శబ్దాలకు విధీవిరామము లేదు. కొండల మీద నుండి సెలయేళ్లలాగు గాయాల నుండి రక్తధారలు స్రవిస్తున్నాయి. సమీపంలో వున్న వృక్షాలూ, పొదలూ, తీగలూ సమూలంగా నాశనమైపోయి, స్వచ్ఛమైన చంద్ర కాంతి యుద్ధభూమినిండా పడుతూంది. రక్తసిక్తములైన వాటి బలిష్ఠకాయములు వెన్నెలలో భయావహములై బీభత్స ప్రదర్శనం చేస్తున్నాయి.

సమీపంలోనే కూచుని స్త్రీమృగం యీ మహా సంగ్రామమును కుతూహలంతో విలోకిస్తూంది. రుధిర ధారలతో భూమిఅంతా తడిసిపోయినది. పోరాడుతున్న కొద్దీ, రక్తంకాలువలు కడుతున్న కొద్దీ, శరీరంనుంచి కండలు వూడిపోతున్న కొద్దీ వాటికి పంతమూ, పౌరుషమూ, మాత్సరమూ ఎక్కువై పోవడంచేత పోరుమరింత తీవ్ర స్వరూపం ధరించినది.

ఇలాగ్గా యుద్ధం రమారమీ రెండుగంటలసేపు సాగింది. అప్పటికి ఒకదానికి శక్తి కొంచెం తగ్గిపోయినట్లుగా తోచింది, అది అలసట సూచనలు కనపర్చడం ప్రారంభించింది. ఆసంగతి గ్రహించిన వెంటనే రెండవది దానిమీదికి లంఘించి నేలమీద పడేసింది. శత్రుకళేబరముపైని కూచుని ముక్కముక్కలుగా చీరేసింది.

విజయోత్సాహంతో, రక్తసిక్తములైన బాహువులతో ఆఖడ్గమృగం స్త్రీమృగం దగ్గరకి వెళ్లింది. నిరుపమానమైన సంతోషంతో విజయలక్ష్మిని వరించిన పురుషమృగమును స్త్రీమృగము గౌరవించి గాఢాలింగన మొనర్చుకొన్నది. ఆక్రూరసత్వముల మోహోద్రేకము సంపూర్ణ ప్రాణహరణంతోగాని శాంతి పొందలేదు.

*　　*　　*　　*

౧

రామనాథుడూ, విశ్వేశుడూ చిన్ననాటి నుంచీ ప్రాణ స్నేహితులు. విజయ నగరమునకు సమీపాన్నే వున్న ఒక పల్లెటూరు కాపురస్తులు. సంపన్న కాపు కుటుంబులు.

రామనాథుని తండ్రి గ్రామంలో రెవెన్యూపెత్తనదారు. విశ్వేశుని తండ్రి కల్లాంటి వుద్యోగాలు లేకపోయినా పూర్వార్జిత ధన సంపద బాగా వుంది.

పిల్లలిద్దరినీ పల్లెటూరు వీధిబడిలోనికి పంపారు. అప్పటినుంచీ వాళ్లిద్దరికీ స్నేహమేను. ఆటల్లో వాళ్లిద్దరూ ఒకపక్షాన్నే వుండేవారు. బడిలో యిద్దరూ ఒక బెంచీ మీదనే కూచునే వారు? రాత్రివేళ యిద్దరూ విశ్వేశుని యింటిలో ఒక్క దీపందగ్గిరే కూచుని చదువుకునేవారు.

పల్లెటూళ్లో చదువు పూర్తికాగానే విజయనగరంలో ప్రవేశించి స్కూలు ఫైనలువరకూ సాగించారు.

అక్కడనుంచి ఉన్నత విద్యకోసం చెన్నపట్నం వెళ్లాలని రామనాథుడికి బుద్ధి పుట్టింది. విశ్వేశుడుకూడా జననీ జనకులను ఒప్పించి స్నేహితునితో బయలుదేరాడు.

చెన్నపురిలో వాళ్లిద్దరూ పచ్చయప్ప కళాశాలలో ప్రవేశించారు. బి. యే. పట్టం పొందిన తర్వాత యే

వృత్తిలోకి దిగడమా అనే ప్రశ్న వాళ్లకి కలిగింది. వెనకముందు లాలోచించుకుని చివరకు లాకాలేజీలో ప్రవేశించారు. ఆసంవత్సరమే "సరస్వతి" అనేమహారాష్ట్ర యువతికూడా న్యాయవాద పరీక్షకొరకు లాకాలేజీలో ప్రవేశించినది.

చిన్నప్పుడు కుర్రవాళ్లను చూసినవారు యిప్పుడు మళ్లా పోల్చుకోలేకుండా వున్నారు. వాళ్ల వేషభాషలు పూర్తిగా మారిపోయినవి. చిన్నప్పటి స్నేహితులకి కూడా వాళ్లేదో దేవలోకంలోనుంచి దిగిన దేవతలలాగు కనపడేవారు. సెలవులకి స్వగ్రామం వొచ్చారంటే వూళ్లో ఆబాలగోపాలమూ వాళ్లని చూడాలని యెంతో సరదాతో వస్తూవుండేవారు. "పిల్లోళ్లు మారిపోయినారా" అని దీర్ఘాలు తీసుకుంటూ రైతులు చెప్పుకునేవారు. నవనాగరకతా లక్షణాలు వాళ్లలో పూర్తిగా నిండిపోయినవి.

సరస్వతి తండ్రి మహారాష్ట్ర దేశంలో ఒక చిన్న జమీందారీకి దివానుగా పనిచేస్తున్నాడు. సంఘసంస్కరణం అంటే అభిమానం కలవాడు. తాను నమ్మినవిధానములను కేవల వాగాడంబరముతో వెల్లడించడమే కాక ఆచరణలో పెట్టగల కార్యశూరుడు. అతని తండ్రినాడే వారికుటుంబము ఆంధ్రదేశమును వొదిలిపెట్టింది.

కుమార్తెకి ఉన్నత విద్య చెప్పించి న్యాయవాద పరీక్షకు చదివించాలని అతని అభిప్రాయము. బంధువులందరూ తన్ను జాతిభ్రష్టునివలె చూచినప్పటికీ అతడు కించిత్తూ చలించలేదు.

ఒకేతరగతి విద్యార్థులగుటవల్ల సరస్వతికీ, రామనాథవిశ్వేశులకునూ మంచి స్నేహం కలిగింది. సరస్వతి మంచి కలిసి కట్టుగల యువతి. తేటనీటివలె స్వచ్ఛమైన హృదయం కలది.

క్రిస్మసు సెలవులకి సరస్వతితో కూడా వారిద్దరూ వాళ్లవూరు వెళ్లారు. దివానుగారు సౌజన్యహృదయులైన ఆయువకులను ఉచితరీతిని ఆదరించారు.

ఇంతలో ప్రపంచాన్నంతటినీ కదలించిన మహాయుద్ధము "ఐరోపా" ఖండములో ప్రారంభమైనది. యించుమించుగా యూరపులోని అన్ని ముఖ్యదేశములూ కూడా యుద్ధంలోకి దిగినవే. బ్రిటిషు సామ్రాజ్యాంతర్భాగమవడంచేత హిందూదేశము కూడా ధనమునూ, మనుష్యులనూ విరివిగా సాయంచేయడం మొదలుపెట్టినది. ఉత్సాహపూరితులైన యువకులు కళాశాలలను వీడి సైనిక శిక్షణ పొంది రంగములోనికి పోవడం ప్రారంభించారు. ఇతరప్రదేశములన్నిటికంటె చెన్నపురిలో యీసంరంభం మహాయెక్కువగా వుంది.

మార్చినెల. సాయంకాలం ఆరున్నరకి పైగా అయింది. ఒక సౌధోపరిభాగమున నున్నగదిలో రామనాథుడూ, విశ్వేశుడూ కూచున్నారు. చల్లగాలి ధారాళంగా గదిలోనికి వొస్తూంది. రామనాథుడు తన చొక్కా గుండీలను తీసి శరీరానికి చల్లగాలి తగిలిస్తున్నాడు.

అప్పుడే వారిద్దరూ "క్లబ్బు" నుండి ఇంటికి వచ్చారు. ఆసాయంత్రము ఒక మిలిటరీ ఉద్యోగి క్లబ్బులో గొప్ప ఉపన్యాసం యిచ్చాడు. సామ్రాజ్య క్షేమము కొరకు హిందూదేశం సహాయం చేయవలసిన అగత్యం బాగా వివరించి ఆసమయాన్ని సైన్యంలో చేరిన యువకులకు గల లాభాలు తెలియచేస్తూ చాలాసేపు మాట్లాడినాడు.

అది విన్నది మొదలు రామనాథునిమనస్సు మారిపోయినది. సైన్యంలోకి పోయి ఉన్నతోద్యోగాలను సంపాదించాలని అతని మనస్సు తొందర పడుతూంది. క్లబ్బునుంచి యింటికొచ్చేవరకూ అదే ఆలోచన. గదిలోని విద్యుద్దీపపుకాంతిలో రామనాథుని విశాల ఫాలము నిగనిగ మెరుస్తూంది. విశ్వేశు డొకపడకకుర్చీలో విశ్రాంతిగా కూచున్నాడు. సరస్వతి వారి కెదురుగా వేరొకకుర్చీలో కూచుంది. రామనాథుడు మెల్లగా "సరస్వతీ! లెక్చరు విన్నావా?" అన్నాడు.

విశ్వేశు డదరిపడి లేచి, "ఏవకేం? అలా గడుగుతున్నా వెందుకూ? మళ్ళీ యేదైనా వికారపు బుద్ధి పుట్టిందేమిటి?"

"బుద్ధికేముందిగాని, నాకోమారు యూరప్ దేశమంతటా తిరిగి రావాలని వుంది సుమా!"

"మీనాన్న డబ్బిస్తాడా?"

"అదే గట్టిచిక్కు. కాని డబ్బు అక్కర్లేకుండా యాత్రచెయ్యగల వుపాయం ఈసాయంకాలపు లెక్చరులో మనకి తెలియలేదూ?"

"ఆఁ! యేమిటీ! సైన్యంలో చేరాలని వుందా యేమిటి?"

"అలా గడుగుతా వెందుకూ? మనం పటాలంలో చేరితే నిముషంలో మంచి position లోకి వచ్చేస్తాం. B.L. ప్యాసయి మనం యింట్లో కూర్చోవడం నాకిష్టంగా లేదు. కావలసినంత పేరూ, ప్రతిష్ఠావస్తుంది. ఏం సరస్వతీ! మాటాడవూ?

"అది బాగుందిగాని మీవాళ్ళకి రాసి వాళ్ల అనుమతి పొంది మరీ బయలుదేరాలని నావుద్దేశం."

"సరస్వతీ! మేం యెలాగో వుండిపోవాలన్న వుద్దేశంతో నువ్విలాగు చెబుతావు. నీకు మాయందుగల ప్రేమకు కృతజ్ఞులమేగాని ఉన్నతోద్యోగములతో, నూతన గౌరవాలతో వచ్చే స్నేహితులను చూడ్డానికి నీకు కోరిక లేదూ? నువ్వు సంతోషంతో పంపిస్తేగాని మేము వెళ్లము."

"బాగుందిగాని మీరు వెళ్లిపోతారంటే నాకెందుకో కష్టంగా వుంది. అయినా మీ ఉత్సాహభంగం చెయ్యడం నాకిష్టంలేదు వెళ్లి శీఘ్రంగా రండి. అయితే మీవాళ్ళకి రాయరూ?"

"మళ్లీ అదేమాటగదా! వాళ్ళకి తెలుస్తే అడుగు కదల నివ్వరని చెప్పడం లేదూ? మేం సైన్యంలో చేరిన తరువాత రాస్తే మరి పరవా వుండదు."

సరస్వతి చిరునవ్వుతో "రామనాథుని వన్నీ దొంగయెత్తులే" అంటూ విశ్వేశ్వరునివంక చూసి, "అయితే తరుచు యుద్ధరంగాలను గురించి నాకు జాబులు రాస్తూ వుంటా రన్నమాటేగదూ?"

"అయ్యో! అలాగని నువ్వు కోరాలా సరస్వతీ! ఎంత ప్రేమార్ద్రహృదయవు! రామనాథుడు పట్టినపట్టు విడిచీపుటం కాదు. ఈప్రయాణసమయంలో నీలాంటి స్నేహితురాలిని విడిచి వెళ్ళడం కష్టంగా వుంది."

సరస్వతినయనములు అశ్రుపూరితములయినవి. రామనాథుడామెను చూచి, "అయ్యో! సరస్వతీ! ఎంత మెత్తని మనస్సు నీది! చాల్లే, వూరుకో. మళ్లీ త్వరగా రావాలని భగవంతుని ప్రార్థించు. మీనాయనగారికి మానమస్కారములు చెప్పు."

"అయ్యో సరస్వతీ! ఎంత మెత్తని మనస్సు నీది! చాల్లే, వూరుకో."

పైకల్లా ధైర్యంగా మాటలాడినప్పటికీ సరస్వతిని వదలివెళ్ళడం రామనాథునికికూడా కష్టంగానే వుంది. సరళమై, సౌఖ్యప్రదమైన ఆమె స్నేహలాలనమున అతడిన్నాళ్లూ మైమరచిపోయి వున్నాడు. ఇప్పుడామెను విడిచిపెట్టి వెళ్ళడం అంటే మనస్సుకు నొప్పి కలుగుతూంది. అతనికి తెలియకుండానే ఆమెయెడల ప్రేమ భావాలు అతని మనస్సులో వృద్ధిపొందినవి. అవి యిప్పటికిగాని అతనికి తెలియలేదు.

విశ్వేశుడుమాత్రం మనస్ఫూర్తిగా మొదటి నుంచీ సరస్వతిని ప్రేమించినాడు. ఆమె సుందరవిగ్రహం చూసేసరికి అతనికి నేత్రపర్వంగా వుండేది. రహస్యంగా తనహృదయపీఠముమీద సరస్వతీవిగ్రహాన్ని నిల్పి సంతతధ్యానం చేస్తున్నాడతడు. ఆతని కీయెడబాటెంత బాధ కలిగించినదో వేరుగ చెప్పనక్కరలేదుకదా!

౨

నాలుగు సంవత్సరములు గడిచాయి. రామనాథుడూ, విశ్వేశుడూ సైన్యంలో మంచి ఉన్నతాధికారములను పొందినారు. వాళ్లిద్దరూ కలిసి ఒకపటాలంలోనే వుండాలని వాళ్ల ఆశ. కాని పైఅధికారులు వాళ్ళని వేరువేరు పటాలాల్లో పడేశారు. అసలు యుద్ధరంగమునకు వెళ్ళవలసివచ్చినప్పుడు రామనాథుడున్న పటాలమొకదేశమూ, విశ్వేశుడున్న పటాలం వేరొకదేశమూ వెళ్ళక తప్పినది కాదు.

వారిద్దరిమధ్యా తరుచు ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి. వారివారి రంగస్థలాలను వర్ణిస్తూ యిద్దరూ తరుచు సరస్వతికి రాస్తూవుండేవారు. బొంబాయిలో వకీలువృత్తిని ప్రారంభించిన సరస్వతి తన కృతజ్ఞతను తెలుపుతూ జవాబు లిస్తూవుండేది.

నాలుగు సంవత్సరాలు గడిచిన తర్వాత, సకలదేశపీడాకరమైన సమరము చాలించబడినది. చాలవఱకు కొత్తపటాలములను యుద్ధం అయిన తర్వాత విడగొట్టేశారు. రామనాథునిమాత్రం ప్రభుత్వంవారు శాశ్వతంగా తమ సైన్యములో వుండిపోవలెనని కోరినారు. ముందు వెనుక లాలోచించి అతడందుకు సమ్మతించి ఒక సంవత్సరము సెలవు తీసుకుని స్వదేశానికి బయలుదేరాడు.

బయలుదేరకముందు యీ సంగతులన్నీ ప్రియమిత్రునికి రాసి వెంటనే ప్రయాణమై రమ్మని కోరాడు. కాని విశ్వేశుడున్న పటాలం అప్పటికి విడగొట్టక పోవడంవల్ల మరికొన్ని నెలలవరకూ రావడానికి వీలులేదని అతడు జవాబిచ్చినాడు. అది చూసిన తరవాత తన ప్రయాణపురోజు నిశ్చయించుకుని రామనాథుడు సరస్వతికి తెలియచేశాడు.

రామనాథుడు గృహోన్ముఖుడై దారిలో బొంబాయిలో దిగి సరస్వతిని చూసి మరీ వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నరోజుకి స్టీమరు బొంబాయి రేవు చేరినది. రేవు దూరాన్ని కనబడుతూందనగా రామనాథుడు స్టీమరుపై కప్పు (Deck) మీద నిలబడి పరిచితులైనవారెవరైనా కనబడతారేమో నని ఆశతో యెదురుచూస్తున్నాడు. చిరకాలానంతర మాతృదేశసందర్శనమువలన ఆతనిమనస్సు సంతోషతరంగితమైపోతూంది.

స్టీమరు రేవును సమీపిస్తున్నకొద్దీ దూరదేశాగత బంధుమిత్ర సందర్శనలాలసులగు జనులు రేవులో నిలబడి ఉత్సాహంతో జేబురుమాళ్లను యెగరేస్తూ తమ సంతోషాన్ని తెలియచేస్తున్నారు. స్టీమరు పైభాగమున నిలిచి స్వదేశాగమన కుతూహలులైన ప్రజలు జయజయధ్వానములు చేయుచున్నారు.

రామనాథుడు స్టీమరుదిగి రేవులో ప్రవేశించాడు. కూలివాడొకడతనివెనుక సామాను నెత్తిమీద పెట్టుకుని నడుస్తున్నాడు. రేవులోనున్న అఖండజన ప్రవాహములోనికి దృష్టులు సారిస్తూ అతడు నడుస్తున్నాడు. ఒక్కరుగాని పరిచయు లతనికి కనబడలేదు.

మెల్లిమెల్లిగా జనమును తప్పించుకొని అతడు ఫస్టుక్లాసు ప్రయాణీకులు కూచునే హాలులో ప్రవేశించి ఒక కుర్చీలో కూచున్నాడు. తన దొరటోపీ (Hat) తీసి మేజాబల్లమీద పెట్టాడు.

మరి రెండునిముషాలకి అతని వెనకనించి ఒక మహారాష్ట్రి యువతి ఆ హాలులోనికొచ్చి నలువైపులా ఎవరికోసమో చూస్తూ నిలుచుంది. ఒకడవాలానొఖరామె వెనకనే ఉన్నాడు. రామనాథునకామెను చూసేసరికి శరీరం రోమాంచితమైనది. అతడు వెంటనే లేచి ఆమె చేయి పట్టుకొని "Saraswati! Are you here?" (సరస్వతీ! నీ విక్కడే వున్నావా?) అన్నాడు.

సరస్వతి దిగ్భ్రమజెంది ఒకనిముష మూరుకొని, "రామనాథ్! ఏమి టిది? నిన్ను పోల్చుకోలేకపోయాను,

"సరస్వతీ! నీ విక్కడే వున్నావా?"

పూర్తిగా దొరగారి వైపోయావు. నీ వీవేళ రావేమోనని నిరాశ పొందిపోయాను. నేను స్టీమరుదగ్గరే యింతసేపూ నిలుచుని నిన్ను కలుసుకోలేకపోయాను" అంది.

"నేను రాలేనని నువ్వెంత నిరాశ పొందినావో, యీ రేవులో నీవు నాకు కనబడకపోతే నే నంతకు రెట్టింపు నిరాశ చెందినాను. నేను వచ్చేరోజు ముందుగా తెలియచేసినప్పుడు నన్ను receive చేసుకోడానికి రేవువరకేనా నాసరస్వతి రాకపోతుందా అని కదూ నా ఆలోచన? సరస్వతీ! ఎన్నాళ్లయింది నిన్ను చూసి! ఇప్పు డెంత సంతోషంగా వుంది!"

"ఏం? ఎంతసంతోషంగా వుంది?" నవ్వుతూ సరస్వతి అన్నది.

"నువ్వు రావడంవల్ల నా హృదయంలో చాలా భారం తగ్గిపోయింది సుమా. స్టీమరు దిగడంతోటే నీవు కనబడకపోవడంవల్ల నామనస్సు పరిపరివిధాలపోయింది!"

"నేను రేవులోకి రాకపోతే నీవు మా యింటికి రానేరావు కాబోలు!" అని మందహాసంతో అన్నది.

"దానికేంగాని సరస్వతీ! నేను యుద్ధంలో వుండగా నన్ను ఒక్కసారైనా చూద్దామని బుద్ధి పుట్టిందా నీకు?"

సరస్వతి జవాబు చెప్పకుండానే వెనక నిలుచున్న డవాలాబంట్రోతును చూసి, "ఏమోయ్! మనం అనుకున్నవారు వచ్చారని దాదాగారితో చెప్పి యిల్లా తీసుకొనిరా" అని చెప్పి పంపేసి, స్నేహితుని వంక చూసి, "ఏమిటీ? ఒక్కసారైనా చూడాలని బుద్ధి పుట్టిందా అంటావా? నా వుత్తరాలు నీకు అందలేదూ? నీకు యెదురుగా కొంతదూరము వద్దామనుకున్నాం కూడాను నేనూ, దాదాగారూనూ. దాదాగారికే చూడాలని ఆతురతగా వున్నప్పుడు నామాట అడగడ మెందుకూ?"

సరస్వతిమాట లాతనిచెవుల కమృతపు సోనలైనవి. ఆమె మృదుహస్తాన్ని తనచేతులమధ్య నుంచుకుని సాభిప్రాయంగా ఆమెవేపు చూస్తూ, "సరస్వతీ! నే డెంత సుదినం!" అన్నాడు మెల్లగా.

ఆ పలుకులు సరస్వతికి వేరువిధంగా తోచినవి. కేవలం తొందరస్వభావంకల రామనాథుని మాటలలో ఆమె కొక కొత్త మృదుత్వమూ, నెమ్మదీ గోచరించాయి. ఆమెకూడా మందస్వరమున "ఆహా! నిజంగా" అని మాత్రం మారుపలికింది.

ఇంతలో సరస్వతితండ్రి నౌఖరుతోకూడా లోపల ప్రవేశించాడు. రామనాథుడు వెంటనే లేచి ఆయన కెదురుగా వెళ్లి కరస్పర్శనం చేశాడు. కుశలప్రశ్న లయిన తర్వాత యుద్ధవిశేషాలనుగూర్చి వారు చాలాసేపు ముచ్చటించుకుంటూ ముగ్గురూ మోటారులో యింటికి పోయారు.

భోజనా లయిన తర్వాత విశ్వేశుని గురించి సరస్వతి చాలాప్రశ్న లడిగింది. వాటికి సమాధానం చెబుతూ రామనాథుడు విశ్రాంతిపొందినాడు. దాదాగారూ, కుమార్తెయూ అతన్ని చాలా గౌరవించారు.

ఆ సాయంత్రం ముగ్గురూ కలిసి సినీమాకి వెళ్లారు. మిత్రుడు వచ్చినందుకు గౌరవసూచకంగా సరస్వతి యెన్నో వినోదాలు యేర్పాటుచేసింది. ఆసారి అతడు బొంబాయిలో అయిదురోజులుమాత్రం వుండి, మళ్లీ నెలరోజుల్లో తిరిగి వచ్చేటట్టు ఒప్పుకుని స్వగ్రామానికి వెళ్లాడు.

3

అనుకున్నట్టుగా నెలరోజులనాటికి రామనాథుడు మరల బొంబాయి వొచ్చాడు. చారిత్రక ప్రసిద్ధిగల స్థలాలను సందర్శిస్తూ, వినోదవిహారాల్లో సరస్వతితో అతను చాలారోజులు గడిపాడు. విశ్వేశుని వద్దనుండి జాబులు వస్తూ నేవున్నాయి. అతడు రావడానికి ఇంకా రెండునెలలు గడువుంది.

బొంబాయిలో వున్న రోజుల్లో సరస్వతి గడియైనా అతన్ని వొదిలిపెట్టి వుండలేదు. వీధిలోకి వెళ్లేటప్పుడు మిలిటరీ (సైనిక) దుస్తులను ధరించిన రామనాథుని చూడాలని ఆమె కెంతో మనసుగా వుండేది. మోటారులో అతనితోకూడి విందులకూ, సినీమాలకూ, సభలకూ వెళ్లడమంటే ఆమెకు సరదా.

రమారమి నెలరోజులు బొంబాయిలో వుండి అతడు మళ్లీ స్వగ్రామం చేరుకున్నాడు. సరస్వతి ప్రియమిత్రుని వొదల్లేక వొదల్లేక వొదిలిపెట్టింది. ఆమెను కూడా తనతో రావలెనని చాలా బలవంతపరిచాడు. సరస్వతి మందహాసవదనంతో "తరవాత యెలాగూ రావాలి కదూ? యిప్పు డెందుకూ?" అని జవాబు చెప్పింది.

రామనాథుడు స్వగ్రామం చేరిన తరవాత పది రోజుల్లో విశ్వేశుడు మరి వారంరోజుల్లో రానైయున్నట్టు జాబు రాశాడు. అపరిమిత సంతోషముతో నాతడు వచ్చేనాటి కొకరోజు ముందుగానే విశాఖపట్నం వరకూ వెళ్లి అతన్ని కలుసుకొని తీసుకొచ్చాడు.

చాలా కాలం అయిన తర్వాత కలుసుకోవడం వల్ల మిత్రులిద్దరూ ఒక్క నిముషమైనా ఒకరి నొకరు విడిచిపెట్టి వుండలేకపోయేవారు. ఉద్యోగ సంబంధమైనకబుర్లు చెప్పుకుంటూ, యుద్ధరంగములను వర్ణించుకుంటూ వాళ్లు అతిసంతోషంగా కాలంగడుపుతున్నారు.

యుద్ధంలో బ్రిటిషు సామ్రాజ్యానికి సహాయమొనర్చినవారందరికీ బహుమతు లివ్వడానికని చెన్నపట్నంలో గవర్నరు ఒకసభ చేశాడు. ఆసభకు రావలెనని మిత్రు లిద్దరికీ ఆహ్వానపత్రికలు వచ్చినవి.

చెన్నపురిలో పని పూర్తిచేసుకొని బొంబాయి వెళ్లాలని విశ్వేశుడు నిశ్చయించుకున్నాడు. తమప్రయాణంగురించి సరస్వతికి తెలియచేస్తూ సభ జరిగేనాటికి చెన్నపురి రావలెననిన్నీ, అక్కడనుంచి అందరూ కలిసి బొంబాయి వెళ్ళవొచ్చుననిన్నీ రాశాడు. కాని కొన్ని కారణాంతరములచేత సభకు వచ్చి ప్రియమిత్రులకు జరుగు సన్మానమును చూసేభాగ్యము లేనందుకు విచారిస్తూ సభ జరిగిన వెంటనే మాత్రం తప్పక బొంబాయి రావలెనని ఆమె జవాబిచ్చినది.

సభ యింకా వారంరోజు లుండగా రామనాథుడూ, విశ్వేశుడూ చెన్నపురి చేరారు. చిన్ననాటి స్నేహితులనేకులు వారిని ఆహ్వానించారు. తమవిద్యాభ్యాసమునాటి స్థలాలన్నీ దర్శిస్తూ వాళ్లు నిరుపమానానందమును పొందినారు.

ఇట్టి సంతోషసమయంలో సరస్వతి లేనందుకు వారు చాలావిచారించారు. మద్రాసులోని వారిదినచర్య యేరోజుకారోజు సరస్వతికి రాయకుండా వుండ లేకపోయేవారు.

ఏప్రిల్ నెల. వసంతసమయ సౌభాగ్య మెల్లచోట్లను ద్యోతక మవుతూంది. దినమంతయు తీక్ష్ణ సూర్యాతపతప్తులగు జనులు దినాంతకాల శీతల వాతపోతసౌఖ్యమున మైమరచి ఉద్యానవన ప్రదేశముల కాలాతిక్రమణమును గణింపక విశ్రమించి యున్నారు. ఏడు గంటలకు పైగా అయింది. జనాకీర్ణమైన చెన్ననగరంలోని ప్రజలు వారివారి పనుల ముగించుకుని యిళ్ళకు చేరుకుంటున్నారు. బజారులన్నీ విద్యుద్దీపముల కాంతిలో వింత శోభను పొందినవి.

పార్కు (ఉద్యానవనము)లో స్నేహితు లిద్దరూ ఒక పలువరాతి తిన్నెమీద కూచుని సంభాషించు కుంటున్నారు. ఉద్యాన వనంలోని పుష్పాలమీద నుండి తియ్యని సువాసనలు గాలిలో తేలిపోతున్నాయి. తిన్నె వెనుకనున్న పొన్నచెట్టు నీడను వారిద్దరూ కూచున్నారు. అనేక విషయాలు దాటిన తర్వాత వారి సంభాషణ క్రమంగా యీ క్రింది విధంగా మారింది.—

రామనాథుడు:—"విశ్వేశం! సరస్వతి లేకపోవడం మన కేమీ వుత్సాహంగా లేదు సుమా!"

"నేను రమ్మని రాశానుగదా. మనం యెన్ని సార్లో సరస్వతితో ముచ్చటించుకుంటూ యీ రాయి మీద కూచుంటూ వుండేవాళ్ళంకదూ! అందుచేత యీ వేళ మరీ చిన్నపోయిన ట్లగుపిస్తూంది."

"ఈ summer (వేసవి) వరకేకదూ ఆమె మనలని యెంత విడివిపెట్టి వుండినానూ? ఆతర్వాత మన సుందరమూ ఒక్కచోటే వుండవొచ్చు."

"ఏం? అలాగంటున్నావు? సైన్యాధిపత్యం సరదా తీరిందా యేమిటి? మళ్లా బొంబాయిలో ప్రాక్టీసు పెడతావు కాబోలూ?"

"ఆఁ!అయ్యో! నీతో చెప్పడమే మరచిపోయాను. అది నువ్వెరగవు కాబోలూ? ఇల్లాంటి సంతోష వార్త యిన్నాళ్లు నీకు తెలియచెయ్యకుండా దాచి పెట్టినందుకు క్షమించు విశ్వేశం. ఈ summer లో సరస్వతి వివాహం చేసుకుంటుంది. తెలిసిందా?"

"ఆ! అలాగా! ఏమిటీ? పెళ్లే? యెప్పుడూ? యీసమ్మర్ లోనే! పెళ్లికొడు కెవరూ?"

"పెళ్లికొడుకా? ఆమహాభాగ్యానికి నోచుకున్న వాడు నీప్రియస్నేహితుడు రామనాథుడే!"

ఆమాట వినేసరికి విశ్వేశునిముఖం వివర్ణమైపోయినది. అతని హృదయంలో ఒక ఆందోళన బయలుదేరినది. ఆ ఆవేదన కష్టంతో ఆపుకున్నాడు. కాని కొంత సేపటివరకూ మాటాడ లేకపోయాడు. చివర కెలాగో ప్రయత్నంతో లేని ప్రసన్నత తెచ్చుకుని, "ఓహో! యింతకాలమూ చెప్పకుండా దాచావా?" అన్నాడు.

"విశ్వేశం! I request you to excuse me (నీవు నన్ను క్షమించాలి.) ఈప్రయాణాలూ, అడావిడీ యిందులోబడి చెప్పడం మరిచిపోయాను. మొన్న నేను బొంబాయి వెళ్ళినప్పుడే యీప్రస్తావన దాదాగారు నా దగ్గిర తీసుకొచ్చారు. చాలాసేపు సంభాషించినమీదట బాగా వితర్కించుకుని సుమూర్త అనుమతిపైనే ఆయన యీనిశ్చయం చేసుకున్నాడు."

"మీఫాదరూ వాళ్లూ యెరుగుదురా యీసంగతి?"

"ఏమో వాళ్లేఅభ్యంతరాలు కల్పిస్తారేమోనని వాళ్లతో చెప్పలేదు సుమా యింతవరకూను."

"ఏం? ఏం తప్పుచేస్తున్నావని వాళ్లు అభ్యంతరాలు కలిగిస్తారూ?"

"తప్పు కేముందిలే. వాళ్లు కొంచెం పూర్వాచారపు చాదస్తపురకంకదూ. నే నేదో ప్రమాదంచేస్తున్నానని గోలచేస్తారు. అంతా అయిపోనిచ్చి తెలిసినా ఫరవాలేదు."

ఇదంతా వింటూ విశ్వేశుడు దీర్ఘాలోచన చేస్తున్నాడు. అతని హృదయం భారంగా తిరుగుతూంది. ఇంతవరకూ అన్నివిషయాల్లోనూ తనతో సమానంగా వొచ్చిన రామనాథు డిప్పుడు తనకంటె అదృష్టవంతుడైపోయాడు. తను గాఢంగా ప్రేమించి మనస్సులోనే పెంచిన ఆలోచన నిమిషంలో ముక్కముక్కలైపోయినది. సరస్వతి రామనాథుని సొమ్మైపోయినది. తనచేతిలో నుండి దాటిపోయినది.

ఈ ఆలోచనలు అతని మనస్సులో గిర్రున తిరిగిపోయినవి. ఒళ్లు తిరుగుతూవున్నట్టుగా తోచింది. ముఖలక్షణాలు వికారంగా మారిపోయాయి. కాని అతను పొన్నచెట్టునీడని కూర్చొనడంవల్ల యిదంతా రామనాథుడు కనిపెట్టలేదు. సరస్వతినిగురించి ప్రస్తావన రావడం అందులో వివాహప్రసక్తి వచ్చినందుచేత అతడు సంతోషాతిశయమున శరీరం మరిచిపోయివున్నాడు. బాల్యస్నేహితునితో తన భావిసౌఖ్యమయజీవితమును గురించి ముచ్చటించడానికి అతని మనస్సు ఉరకలువేస్తూంది. తన

సౌఖ్యాన్ని గూర్చి చెప్పుకుని ఆనందించడానికి విశ్వేశుని కంటె ఆప్తులు అతని కెవ్వరూ కనబడలేదు.

ఎట్టకేలకు విశ్వేశుడు మరల "అయితే వివాహం యేనెలలోనూ?" అని అడిగాడు.

అడగడమే తడవుగా రామనాథుడు "ఎప్పుడా? మే నెలలోనే కదూ? ఇప్పటికింకా రెండు నెల లుందోయ్. పెళ్లికి నాతరపున వచ్చేవాళ్లలో పరమాప్తుడవు నీవే సుమా. పెత్తనం అంతా నీదే. నీకోసమనే వివాహం యింతదాకా ఆపుచేసుకోవలసి వచ్చింది. ఏం! ఆలోచిస్తావేం? వివాహానికి కావలసిన యేర్పాట్లన్నీ నీవు చూసుకోవచ్చును. ఏం? సిద్ధమేనా?" అన్నాడు. అతడాడిన ప్రతిమాటలోనూ ఉత్సాహ సంతోషము లుప్పొంగిపోతున్నాయి. ఒక్కొక్కమాట ఒక్కొక్క శూలపు పోటులాగ తన మిత్రుణ్ణి బాధిస్తున్నాయని ఆ నిర్మలహృదయు డెరగడు. సరస్వతితో కూడిన సౌఖ్యమయభావిజీవితము మనోవీథిని పొడకట్టి అతన్ని తన్మయుణ్ణి చేసేస్తూంది. తన భావోద్రేకమే కాని స్నేహితుని చిత్తవృత్తిని కనిపెట్టేస్థితిలో లేడు రామనాథుడు.

౪

విశ్వేశునికి క్రమంగా కోపం హెచ్చిపోతూంది. మిత్రుని సంతోషాతిశయం చూస్తున్న కొద్దీ ఆతనికి వొళ్లు మండుకు పోతూంది. రామనాథునితనబహిఃప్రాణంగా చూసుకుంటూ వున్న విశ్వేశుని మనస్సులో యీ వింతమార్పు క్షణంలో కలిగింది. పందెంలో ఓడిపోయినవాడికి గెలిచిన వాడియం దేలాటిభావాలు కలుగుతాయో అలాంటివే యిప్పుడు విశ్వేశుని కలవరపెడుతున్నాయి. పందెంలో రామనాథుడు గెల్చేసి బహుమతియైన సరస్వతిని పొందాడు.

సరస్వతిని ప్రేమించి ఆమె నెల్లాగైనా పొందవలెననే కోరిక మొదటినుంచి విశ్వేశుని హృదయాంతరాళంలో వుంది. తనజీవితాన్నైనా నిమిషంలో పరిత్యజించ గలడు గాని ఆకోరికను మాత్రం అతడు వదలలేడు.

ఇప్పు డేమయింది! సరస్వతి రామనాథునకు అప్పుడే వాగ్దాన మయిపోయినది. తన ఆశలన్నీ భగ్నములై పోవలసిన వేనా? ఇంక తనకు ప్రాణం వుండి మాత్రం లాభ మేమిటి?

రామనాథు డెంతటి మిత్రద్రోహి! తను లేనిసమయం చూసుకుని సరస్వతిచేత వాగ్దానం చేయించుకున్నాడు!

పైవిధములైన ఆలోచనలు అతన్ని క్షోభపెట్టేస్తున్నాయి. తన్ను ద్రోహంచేసిన దుర్మార్గుణ్ణి ఒక్క వేటుతో హతమార్చేస్తేమాత్రం, పాపం, యేముం దనుకున్నాడు. విశ్వేశు డామెను ప్రేమించినట్లే రామనాథునకు తెలియదు. కాని ఆసంగతి తామసపూరితుడైన విశ్వేశున కాసమయంలో స్ఫురిస్తుందా?



"అప్రయత్నంగానే అతనిహస్తం మెలలోనున్న బాకుమీదకి పోయింది."

రామనాథుని ముఖంవేపు తీక్ష్ణంగా చూస్తున్నాడు విశ్వేశుడు. అప్రయత్నంగానే అతనిహస్తం మొలలో నున్న బాకుమీదికి పోయింది. రాతిబెంచీకి

చేరబడి సంతోషంతో మాటలు చెబుతూవున్నాడు రామనాథుడు. కొమ్మలసందులోనుండి విద్యుద్దీపపు కాంతి ఆతని మెడమీద పడుతూంది. విశ్వేశుని దృష్టి ఆమెడమీద కేంద్రీకరింపబడ్డది. ఆబాకుతో ఒక్కపోటు పొడిచి అందులోని ఉత్సాహపూరిత రక్తప్రవాహమును బయటకు తీసేయా లనుకున్నాడు.

రామనాథు డిదంతాగమనించలేదు. అతనేదో గొడవ చెప్పుకుపోతున్నాడు. "ఇదుగోనోయ్! పెళ్లి అయిన వెంటనే ఏసిమ్లాయో పోయి Honey moon గడుపుదామని సరస్వతి చెప్పిందోయ్. నిన్నుగూడా సిమ్లాకి తీసుకుపోవాలని ఆమె అభిప్రాయం. నువ్వు కూడా సెలవుపెట్టి వుండిపోతే తరవాత మనిద్దరమూ గూడా ఒక పటాలంలోనే వుండేటట్లు యేర్పాటు చేసుకుందాం. అప్పుడు సరస్వతి కూడా మనతోటే వుంటుంది. ఆమెకి నువ్వంటే ప్రాణం సుమా. మనం ముగ్గురమూ ఒక్కచోటే వుండాలని ఆమె ఆలోచన."

వింటూన్నకొద్దీ విశ్వేశునకు తేళ్లూ, జెర్రులూ శరీరంమీద ప్రాకినట్లుగా అవుతూంది. తల తిరుగుతూంది. ఉద్రేకంతో అతను బాకుపిడిని గట్టిగా పట్టుకుని పైకి లాగినాడు. హఠాత్తుగా అతనికి మెలుకువ వచ్చినట్లయింది. తత్క్షణం రహస్యంగా బాకును తిరిగీ యథాస్థానంలో దాచేశాడు.

"ఆఁ—! ఏం చెయ్యబోతున్నావూ? ఒక స్త్రీ కోసం—కేవలం ఒక స్త్రీకోసం—అమాయకుడై, నీ క్షేమంకోసం తనరక్తమేనా ధారపోయడానికి వెనుదీయని ప్రాణాధికస్నేహితుని వధించడానికి సిద్ధపడుతున్నావా? ఛీ—విశ్వేశా! నువ్వు మహాపాపివి. హంతకుడివి. పులికన్నా ఘోరమైన ఘాతుకత్వంగల నరజంతువువు నీవు. మిత్రరక్తంతో నీహస్తాలు కలుషితం చేసుకోడానికి చూస్తున్నావు. ఎంతమహాపాపికైననూ ముక్తి వుందిగాని నీకుమాత్రం లేదు." అని అతని అంతరాత్మ బోధిస్తూంది.

కాని ఆవెనకనే వేరొకబుద్ధి "విశ్వేశం! ఇప్పుడు వెనకతీశావంటే ఇంక నీజన్మకి సౌఖ్యం సున్నా. నీజీవితం అంధకారావృతమైపోతుందిసుమా. నీవాంఛితార్థం సిద్ధించనప్పుడు నీబతుకు కాల్చనా? నీసౌఖ్య నిధానమును అపహరించినవాడు నీ కెల్లాంటి స్నేహితుడు? పొడువు—పొడువు— యిదే మంచిశకుణం—" అని బోధిస్తూంది.

విశ్వేశునికి అంతరాత్మ బోధన చెవి కెక్కలేదు. ఇంద్రియాధీనమైన బుద్ధికే లొంగిపోయినాడు. "ఆమెడమీద ఆవిద్యుద్దీపపుకాంతి పడుతున్నచోట—ఒక్కపోటుతో అన్ని బాధలూ తొలగి పోతాయి. రామనాథు డీప్రపంచకంలోనే లేకపోతే సరస్వతి నా దైపోక తప్పదు కదా! కాని యీనడివీథిలో యిల్లాంటి పని చెయ్యకూడదు. ఇంటికి పోయిన తరవాత పనిపట్టేస్తాను." అనుకున్నాడు.

రామనాథుడు ప్రియమిత్రుని పరాధీన మానసమును గ్రహించి, "ఏమోయ్! బొత్తిగా కలివిడిగా లేవు యీవేళ?" అన్నాడు.

"ఏదో తలనొప్పిగానూ, వంట్లో వికారంగానూ వుంది; బాధగా వుంది."

"అయితే లే. యింటికి పద, పడుకుందుగాని. కడచినరాత్రి నిద్ర లేనందుచేత కలిగింది యీబాధ. చెయ్యి ఊతగా యివ్వనా? రావోయ్!" అని అతన్ని మెల్లగా లేవదీశాడు.

దారిలో విశ్వేశుడు జబ్బు పడిన వాడిలాగు తూలిపోతూ నడిచేవాడు. రామనాథు డతన్ని పట్టుకుని బుజానికి ఆనించుకుని నడిచేవాడు. అడుగడుగునా అతనికి దాహం కావలసి వచ్చేది. సమస్తోపచారాలూ రామనాథుడే చేశాడు. చివర కెల్లాగో ఒక బండిమీద బసకి చేరుకున్నారు.

విశ్వేశు డొక పడకకుర్చీలో కూచున్నాడు. అతని శరీరమంతా మంటల్లో వున్నట్టుంది. తనకేవో సపర్యల చేయబోతూవున్న రామనాథుని చూసి, "నే నిలాగే ఒక గడియసేపు కూచుంటాను. ఏమీ గడబిడ చేయకు. మరొక గంటకు అదే పోతుంది" అన్నాడు.

మళ్లా అతని మనస్సులో తర్క వితర్కములు ప్రారంభమైనవి. "నీకు తలనొప్పి వచ్చిందన్న దగ్గిరనించీ ఎంత ఖేదపడుతున్నాడో చూడూ రామనాథుడు! ఇటువంటి సుగుణఖనియైన మిత్రునా నీవు చంపడం? కేవలం ఐహిక సౌఖ్యాలేనా మనుష్యునకు కావలసినవి? పరలోకపు చింత కొంచెమైనా వుండ నక్కరలేదా? కేవలం కామప్రేరితమైన యీ మోహాంకంకంటె, అస్వార్థమై భవ్యమైన మిత్రప్రేమ పవిత్రతరము కాదా? ఈలోకంలో కాకపోతే యింకోలోకంలో నైనా సర్వేశ్వరుని యెదుట యీ మహాపరాధమునకు జవాబు చెప్పకోకుండా నీవు తప్పించుకోలేవు సుమా! మిత్రద్రోహివై యిప్పుడు నీవు చంపివేసి నప్పటికీ తరవాత నీవు సౌఖ్యపడలేవు. నీ అంతరాత్మ నిన్ను సౌఖ్యపడ నివ్వదు. భూలోకనరకం అనుభవిస్తావు సుమా! జాగ్రత్త!" అని అతని అంతరాత్మ నొక్కినొక్కి చెబుతూంది.

"విశ్వేశం! సమయం దాటిపోనిస్తున్నావు సుమా! తరవాత విచారించి లాభంలేదు. ఏమో! పరలోకం అనేది వుందో లేదో యెవడికి తెలుసునూ? ఊహా ప్రపంచంలో దేవులాడవలసినవాళ్లు కవులు గాని నీలాగు సౌఖ్యపడదలచుకున్నవాళ్లు కాదు. మొన్న నేకదా మహా సంగ్రామమున వందలకొద్దీ ప్రాణాలు తీసేశావు. ఇది నీకొక లెక్కా? సరస్వతీ, రామనాథుడూ సౌఖ్యపడుతూ వుంటే నీవు చూస్తూ భరించగలవా? నీ ప్రాణాలు నిలుస్తాయా? లే. ఒక్కపోటు పొడిచి సుఖించు." అని వేరొక బుద్ధి హెచ్చరిస్తూంది.

విశ్వేశుడు నిశ్చయం చేసుకున్నాడు. తెగించేశాడు. రామనాథునివంక చూశాడు. అతడు కుర్చీలో కూచుని జనాకీర్ణమైన వీధివంక చూస్తూ చల్లగాలి అనుభవిస్తున్నాడు. విశ్వేశుని హస్తం బాకుపిడిమీదికి పోయింది. ఆయుధప్రయోగంలో నిపుణతగలవాడైనా బాకును పైకితీయడాని కతనికి శక్తిలేకపోయినది. చివరకు మహాప్రయత్నంతో ఊడతీశాడు. అతని చెయ్యి గడగడా వణికిపోయింది. లేవాలని ప్రయత్నించాడు. కాని లేవలేకపోయాడు. ఆపాదమస్తకమూ శరీరం వొణికిపోతూంది. పళ్లు బిగపట్టాడు.

రామనాథుడు మిత్రుని యమయాతన కొంచెమూ యెరగడు.

విశ్వేశుని భావనా ప్రపంచంలో కండ్లముందు వికృతస్వరూపములు భయంకరనృత్యం చేస్తున్నాయి. అవి పండ్లికిలించి అతన్ని చూసి వికటాట్టహాసములు చేస్తున్నాయి. వాటిని చూసేసరికి అతని శరీరం జలదరించి పోయినది. అవి క్రమంగా మీద పడేటట్లుగా కనుపిస్తున్నాయి. లేవడాని కతనికి శక్తి లేదు.

ఎలాగో ఊపిరి బిగబట్టి, చివరసారి నిశ్చయం చేసుకుని, "హు"మ్మని లేచాడు. కాని, అతని కాళ్లలో బలం లేకపోయినది. ప్రపంచమంతా గిర్రున తిరిగిపోతున్నది. నయనములకు దృష్టిమాంద్యమూ, దృష్ట్యవరోధమూ కలిగినది. చేతులోవున్న బాకుతోసహా "గభాలు"న నేలమీద పడిపోయినాడు విశ్వేశుడు. అడ్డంగావున్న కుర్చీ రెండుముక్కలుగా విరిగిపోయినది.

ఈశబ్దం విని రామనాథుడు ఉలికిపడి లేచాడు. తక్షణం వెళ్లి స్నేహితుణ్ని లేవనెత్తాడు. అతనికి శరీర స్మృతి లేదు. పరుపుపైని పరుండబెట్టి చల్లని నిర్మలోదకముతో అతని ముఖం కడిగేసి విసనకర్రతో విసిరాడు. అతనిచేతులో బాకు వున్నందుకు రామనాథుడు ఆశ్చర్యచకితుడై కారణము వూహించలేకపోయాడు. అతని కనులయం దశ్రువులు చిమ్మినవి. పదిహేను నిముషాలకు విశ్వేశుడు కన్నులు విప్పి చూశాడు. దయాప్రపూరితమై, శాంతిభరితమైన రామనాథుని వదనము అతనికి కనబడినది. మెల్లగా లేచి కూచున్నాడు. దీనుడై మిత్రునిచూసి, "కొంచెం మంచినీళ్లు" అన్నాడు. దాహం తీర్చుకున్న తరవాత అతనికి బాగా మెళుకువ కలిగినది.

రామనాథుడు "ఏమిటోయ్! అంతట్లోనే యిలా గైపోయావు? డాక్టరుకి కబురంపనా?" అన్నాడు.

"Dear friend (ప్రియమిత్రమా)! Excuse me (నన్ను క్షమించు). డాక్టరక్కరలేదు. ఏదో వికారంచేత అల్లాఅయింది. పరవాలేదులే! నీ దయాహృదయానికి నా నమస్కారములు. ఇంక నా కేబాధా లేదు. నీవు పోయి పడుకో."

"నేను పడుకోడానికేమి లే; నీవంట్లో బాధ తగ్గితే సరి." అని చెబుతూ విశ్వేశుని తలపట్టుకుని, "అబ్బా! యెంతగట్టిగా కొట్టుకుంటున్నాయోయ్ కణతలు! కాస్త అమృతాంజనం రాయనా?" అన్నాడు రామనాథుడు.

"అబ్బే! యేమీ అక్కర్లేదు. నిద్రపోతే అదే తగ్గిపోతుంది. నీగదిలోకి పోయి పడుకో. నేనూ పడుకుంటాను. చాలారాత్రి అయింది."

"పోనీ యీరాత్రికి నేను నీగదిలో పడుకోనా? ఏదేనా అవసరంవస్తే దగ్గరగా వుండడం మంచిదికాదూ?"

"రామనాథ! ఎంతనిర్మల హృదయమోయ్ నీది! Thank you (నేను నీకు చాలా కృతజ్ఞుడను). నాకీబాధ నిద్దరలో పోతుంది. విశేషమైన అవసరముంటే పిలుస్తానులే; నీగదిలోకి పోయి పరుండు. పొద్దుటే కలుద్దాం."

రామనాథుడు వెళ్లాడు. విశ్వేశుడు మంచం మీద కూచుని తనమిత్రుని కరుణార్ద్రహృదయమునకు ఆశ్చర్యపోయాడు. "రామనాథ మనస్సుకీ నామనస్సుకీ స్వర్గానికీ నరకానికీ వున్నంత తేడా వుంది. కలుషపూరితమైన నామనస్సుకి తన పవిత్ర ప్రేమచేష్టలవలన నతడు తగినబుద్ధి చెప్పాడు. నాకు రవంతబాధ కలిగేసరికతని కెంతదుఃఖం వొచ్చింది! తెలివి రాగానే నిర్మలశాంతి సంభరితమైన ఆతని వదనారవింద సందర్శన మవడంవల్ల మండుతూన్న నాహృదయం చల్లపడి సౌఖ్యపడింది. అపవిత్రుని యెడల నట్టిదురూహాల తలపోసిన నానేరము క్షమార్హమైనది గాదు."

ఒక్కనిముషము కళ్లు మూసుకుని ధ్యానించి, మంచందిగి మోకాళ్లపైని కూచుని, చేతులుజోడించి, "సర్వేశ్వరా! దయానిధీ! నీకృపాభిషేచనమువల్ల నే దుర్మదాంధుడనగు నేను నాలోని పశుత్వమును నిర్మూలించ గలిగినాను. ప్రభూత్తమా! కష్టసమయమున కర్తవ్యము నుపదేశించి నాస్నేహితుని రక్షించితివి. తండ్రీ! దాసానుదాసుడను. మహాపరాధిని. రక్షింపుము. నాకృతజ్ఞతాపూర్వకవందనము లందుకొని రక్షింపుము." అని పరాత్పరుని ప్రార్థించుకుని ప్రశాంతమనస్కుడై నిద్రపోయాడు.

"ప్రభూత్తమా! కష్టసమయమున కర్తవ్యము నుపదేశించి నాస్నేహితుని రక్షించితివి."